సాక్షి
విశాఖపట్నం
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



వేద గాయత్రిదేవి ఆలయం దత్తత
నాయుడుతోటలో ఉన్న వేద గాయత్రి దేవి ఆలయాన్ని విశాఖ శ్రీ శారదా పీఠానికి ఆలయ కమిటీ దత్తత ఇచ్చింది. 8లో



అర్ధరాత్రి మృత్యుకేళి
అర్ధరాత్రి వేళ మృత్యుదేవత పంజా విసిరింది... ఘోర రోడ్డు ప్రమాదం రూపంలో ఐదుగురిని బలి తీసుకుంది. 11లో



మనుషులను కలిపేది ధర్మం
ధర్మం ఎల్లప్పుడూ మనుషులను కలుపుతుందని సద్గురు మాతా సుదీక్షాజీ మహారాజ్ అన్నారు. 8లో

పట్టభద్రుల 'స్ట్రాంగ్ రూమ్'..
స్వర్ణభారతి

- ఇక్కడి నుంచే 6 జిల్లాల బ్యాలెట్ బాక్సుల పంపిణీ, నిర్వహణ
- సహాయక పోలింగ్ స్టేషన్ల గుర్తింపునకు తహసీల్దార్ల బృందాలు
- ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కోసం 12 విభాగాల జిల్లా అధికారులకు బాధ్యతలు
- ఓటు ఎక్కడో తెలుసుకొనేందుకు రెండ్రోజుల్లో గ్రాడ్యుయేట్లకు అవగాహన సదస్సులు
- ఈ నెల 13 వరకూ కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

సాక్షి, విశాఖపట్నం : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఎన్నికల విధుల సర్దుబాటు, ప్రవర్తనా నియమావళి, బ్యాలెట్ బాక్సుల పంపిణీ, పోలింగ్ స్టేషన్ల ఎంపిక తదితర అంశాలపై అధికారులు నిరంతర సమీక్షల్లో బిజీబిజీగా మారారు. ఈ నెల 13వ తేదీ వరకూ కొత్తగా ఓటర్లు నమోదుకు గడువు ఉండటంతో దానిపైనా దృష్టిసారించిన అధికారులు.. ఎవరి ఓటు ఎక్కడుందో తెలుసుకునేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి జిల్లాల్లో మొదలైంది. ఎన్నికల కోసం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున పూర్తిస్థాయి చర్యలకు ఉపక్రమించారు. తమ పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్లను తనిఖీలు నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. 1300కి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ల వద్ద.. సహాయక పోలింగ్ స్టేషన్లను కూడా ప్రత్యామ్నాయంగా చూడాలని సూచించారు. 6 జిల్లాల పరిధిలో ఈ తరహా 48 యాక్సిలరీ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. వీటిని కూడా పరిశీలించి.. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించిన ఎంపీడీవోల వద్ద బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలింగ్ అధికారుల్ని గుర్తించి, వారికి ఆర్డర్లు ఇవ్వాలని 5 జిల్లాల కలెక్టర్లకు డా.మల్లికార్జున రిటర్నింగ్ అధికారి హోదాలో లేఖలు రాశారు. ప్రతి జిల్లాలో తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ ముగిసిన తర్వాత మొత్తం బ్యాలెట్ బాక్సులను విశాఖ తరలించేందుకు కావల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. 6 జిల్లాలకు సంబంధించి.. బ్యాలెట్ బాక్సుల నిర్వహణ ప్రక్రియ మొత్తం స్వర్ణభారతి నుంచే నిర్వహించనున్నారు.

కౌంటింగ్ స్వర్ణ భారతిలోనే..
ఆరు జిల్లాల బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌గా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని గుర్తించారు. ప్రతి జిల్లాకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు విడివిడిగా సబ్ స్ట్రాంగ్ రూమ్‌లు స్టేడియంలోనే ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ కూడా ఇక్కడే నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని భద్రత వ్యవహారాల పరంగా పరిశీలించి.. తమ పర్యవేక్షణలోకి పోలీసులు తీసుకోనున్నారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కౌంటింగ్‌కు 36 నుంచి 48 గంటల వరకూ సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితాలు వెల్లడి కాకపోతే.. మరికొంత సమయం పట్టనుంది కాబట్టి.. దానికి సంబంధించి కూడా ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 12 విధుల విభాగాలకు 12 మంది జిల్లా అధికారులను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, అబ్జర్వర్, ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు తదితర విధుల్ని జిల్లా అధికారులకు అప్పగించారు.



మీ ఓటు తెలుసుకోండి..?
ఓటర్లు తమ ఓటు హక్కు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో knowyourvote అనే ఆప్షన్‌ను ఎంచుకొని కార్డు వివరాలు ఇస్తే.. మీ ఓటు ఎక్కడ ఉంది అనేది స్పష్టంగా తెలుస్తుందని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఓట్లకు సంబంధించి గ్రాడ్యుయేట్లలో అవగాహన కల్పించేందుకు అవసరమైన శిక్షణని రెండు మూడు రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు కొత్తగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు పట్టభద్రుల కు ఈ నెల 13వ తేదీ వరకూ గడువు ఉన్నట్లు డీఆర్‌వో తెలిపారు. 13వ తేదీ సాయంత్రంలోపు నమోదు చేసుకుంటే.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులోనే 'శ్రీశైలం' దర్శన టికెట్లు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ) : విశాఖ నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సుల్లోనే దర్శన టికెట్లను అందజేయనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. శ్రీశైలం సూపర్ లగ్జరీ బస్సులో ముందస్తుగా టికెట్ రిజర్వేషన్‌తో పాటు శ్రీశైలం ప్రత్యేక దర్శనం (శీఘ్ర దర్శన, అతి శీఘ్రదర్శనం) టికెట్ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం www.apsrtconline.in ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, లేదా నేరుగా ద్వారకాబస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా బుక్‌చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అప్పలరాజు పేర్కొన్నారు.

ఐటీఐలో నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా

కంచరపాలెం(విశాఖ ఉత్తర): పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) లో వివిధ కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ పూర్తి కాని అభ్యర్థుల కోసం ప్రభుత్వ ఐటీఐ నరవ (కంచరపాలెం పాత ఐటీఐ ప్రాంగణం)లో ఈ నెల 13 సోమవారం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా–2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ నరవ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి తెలిపారు. ప్రముఖ 20 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు అప్రెంటిస్ షిప్ మేళాలో పాల్గొంటారని, అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. ఐటీఐల్లో అన్ని ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ మేళాలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు 13వ తేదీ ఉదయం 10 గంటలకు నేరుగా ప్రభుత్వ ఐటీఐ నందు బయోడేటా, ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 9398785720 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డీఎంహెచ్‌వోకు నోటీసులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావుతో పాటు డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనాధికారి సుమతికి రాష్ట్ర సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 27న అమరావతిలో ఉన్న రాష్ట్ర సమాచార కమిషనర్ ముందు హాజరు కావాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం కార్యకర్త జక్కు నరసింహమూర్తి కోరిన సమాచారం సకాలంలో పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతోపాటు నోటీసులు జారీ చేశారు. ఆరోగ్యశాఖలో ఏడుగురు అటెండర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చిన సమయంలో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై సమాచారం ఇవ్వకపోవడంతో సమాచార హక్కు చట్టం కార్యకర్త జక్కు నరసింహమూర్తి రాష్ట్ర కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో డీఎంహెచ్‌వోకు, ఏవోకు నోటీసులు జారీ చేశారు.

దళారులను నమ్మవద్దు

సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఎలాంటి ఉద్యోగాల నియామకం చేపట్టడం లేదని, దళారుల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు సూచించారు. ఇటీవల దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది దళారాలు నిరుద్యోగులను మభ్యపెడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటుండంతో ఈవో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయంపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దేవస్థానం పేరుతో ఎలాంటి లావాదేవీలు జరిగినా వాటితో దేవస్థానానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయంపై జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

అద్దె చెల్లించకపోవడంతో సామగ్రి స్వాధీనం

దొండపర్తి (విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏకు అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు శుక్రవారం సీతమ్మధారలో ఉన్న బీఎం ఎంటర్‌ప్రైజెస్ షాప్‌లో ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకొని తమ వద్ద భద్రపరిచారు. సీతమ్మధార వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపును బీఎం ఎంటర్‌ప్రైజెస్ పేరుతో 2018లో లీజుకు తీసుకోగా.. ఇప్పటి వరకు సంస్థకు రూ.1,07,60,033 బకాయి పడ్డారు. గతంలో నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతో గతేడాది డిసెంబర్ 2న సీజ్ చేశారు. అద్దె బకాయి చెల్లించేందుకు ఈ నెల 3వ తేదీ వరకు చివరి అవకాశం కల్పించినప్పటికీ కట్టకపోవడంతో శుక్రవారం వీఎంఆర్‌డీఏ రెవెన్యూ, ఆర్‌ఐ, పోలీస్ సిబ్బంది సమక్షంలో షాప్‌లో ఉన్న సామానులను లెక్కించి వీఎంఆర్‌డీఏ ఆధీనంలోకి తీసుకున్నట్లు సంస్థ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. వీఎంఆర్‌డీఏ షాపుల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రజలంతా జగన్ వెంటే..

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్రంలో పేదల సంక్షేమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో శ్రద్ధ వహిస్తూ పాలన అందిస్తున్నారని, ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఓ హోటల్‌లో దళిత నాయకుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి వి.జె. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మేధావుల సదస్సులో ' డొక్కా మాణిక్యవరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు సముచిత స్థానం కల్పించడంపై ఆయా సామాజిక వర్గాలు ఎంతో ఆనందంగా ఉన్నాయన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చి మైనారిటీల అభ్యున్నతికి అనేక సంస్కరణలు చేపట్టి విశేష ఆదరణ చూరగొన్న గొప్ప నేత ముఖ్యమంత్రి జగన్ అన్నారు. సభాధ్యక్షుడు వి.జె.అజయ్ కుమార్ మాట్లాడుతూ జగనన్నను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ. రెహ్మాన్ మాట్లాడుతూ బలహీన వర్గాలను ఐక్యం చేసి ముఖ్యమంత్రి జగన్ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు మేధావులు ముందుకు రావాలన్నారు.

ఈ సదస్సులో రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూదన్, కార్పొరేటర్లు రేయ్యి వెంకటరమణ, మాసిపోగు రాజు. ముఖ్య నాయకులు అక్కరమాని వెంకటరావు, వేల్పుల విజయ్ కుమార్, ఎస్. వెంకట్, రాజ్ కుమార్ , వెంకటరావు , సుభాష్ చంద్రబోస్, ప్రొఫెసర్లు అర్జున్, పుల్లారావు, జార్జ్ విక్టర్, తదితర నాయకులు ప్రసంగించారు. త్వరలో దళితుల సంక్షేమంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడానికి నిర్ణయించినట్లు అజయ్ కుమార్ ప్రకటించారు. అతిథులను అజయ్ కుమార్ సత్కరించారు.

ఆలయాల భూముల పరిరక్షణకు ప్రాధాన్యం

దేవదాయశాఖ ఏడీసీ చంద్రకుమార్



మాట్లాడుతున్న దేవదాయశాఖ ఏడీసీ చంద్రకుమార్

సింహాచలం: దేవాలయాల భూముల పరిరక్షణే ధ్యేయంగా ఆయా ఆలయాల ఈవోలు, ఏసీలు ఇతర అధికారులు పనిచేయాలని రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ ఆదేశించారు. వందేళ్ల తర్వాత జరుగుతున్న రీసర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులతో కలిసి ఎక్కడెక్కడ దేవాలయ భూములు ఉన్నాయో గుర్తించి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఈవోలకు ఆదేశించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాలలో శుక్రవారం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఉన్న దేవదాయశాఖ ఈవోలు, ఏసీలు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. దేవాలయాలకు సంబంధించిన భూములు ఎలా పరిరక్షించాలో వివరించారు.

దేవాలయాల భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో అవగాహన ఏర్పరుచుకుని, రికార్డులను దగ్గర ఉంచుకుని రీసర్వే జరుగుతున్నప్పుడు రెవెన్యూ అధికారులతో కలిసి సంబంధిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఎన్ని భూములు ఉన్నాయో వాటి రికార్డులను రీసర్వే చేసే అధికారులకు అందించాల్సి ఉంటుందన్నారు. తదుపరి హద్దులను గుర్తించి తిరిగి అప్పగించే ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ విశాఖ డీసీ సుజాత, ఏసీ శిరీష, ఐదు జిల్లాలకు చెందిన ఏసీలు, ఆలయాల ఈవోలు, అమరావతిలోని మండల ఎండోమెంట్ ఆఫీసర్, కాకినాడకు చెందిన ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్లు పాల్గొన్నారు.

సాగిపో.. మెరుపులా.. 8లో



బుల్లెట్‌లా దూసుకుపోవచ్చు.. మెరుపు వేగంతో సాగిపోవచ్చు.. దాదాపు పూర్తి కావచ్చిన అనకాపల్లి–ఆనందపురం ఆరు లేన్ల రహదారిపై గంటకు 120 కి.మీ వేగంతో వెళ్లవచ్చని అధికారులు భరోసా ఇస్తున్నారు. మార్చి నెలాఖరుకు పూర్తి కానున్న ఈ రోడ్డు విస్తరణతో విశాఖ నగరానికి ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. – సాక్షి, అనకాపల్లి

ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడుకుందాం



ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రం వద్ద ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామనరేష్

కొమ్మాది(భీమిలి): అంతరించిపోతున్న అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామనరేష్ పేర్కొన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్య ప్రాంతాల్లో తాబేలు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం సాగర్‌నగర్‌లో గల తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వేకువ జామున తాబేళ్లు తీరంలో పెట్టిన గుడ్లను సేకరించి వాటిని ప్రత్యేకించి పొదిగించి మళ్లీ సముద్రంలో విడిచిపెడతామని ఆయన పేర్కొన్నారు. ఈ సంరక్షణ కేంద్రాలకు అటవీశాఖతో పాటు ప్రభుత్వ రంగ, స్వచ్ఛంధ సంస్థలు దన్నుగా నిలుస్తున్నాయని చెప్పారు. అరుదైన ఈ తాబేళ్ల జాతి అంతరించిపోకుండా జిల్లా వ్యాప్తంగా వలంటీర్లను నియమించామన్నారు. తాబేళ్ల గుడ్లు సేకరించి ఇసుక తిన్నెల్లో సంరక్షిస్తున్నట్లు తెలిపారు.

11 ప్లాట్లు.. రూ.11.13 కోట్లు

- వీఎంఆర్‌డీఏ ప్లాట్ల ఈ వేలానికి మంచి స్పందన
- 28 ప్లాట్లకు వేలం వేయగా 11 ప్లాట్లు విక్రయాలు
- వీటి ద్వారా సంస్థకు రూ.11,13,34,004 ఆదాయం
- కూర్మన్నపాలెం ఫేజ్–1కు అత్యధికంగా గజం రూ.65,300కు కొనుగోలు

దొండపర్తి (విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ ప్లాట్ల వేలానికి మంచి స్పందన లభించింది. 11 ప్లాట్ల విక్రయాలు ద్వారా సంస్థకు రూ.11,13,34,004 ఆదాయం వచ్చింది. వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ఖాళీగా ఉన్న 28 ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ కేటగిరీ ప్లాట్లకు ఈ–వేలం నిర్వహించింది. ఇందులో 11 ప్లాట్లు అమ్ముడుపోయాయి. కూర్మన్నపాలెం ఫేజ్–1లో హెచ్‌ఐజీ–36 ప్లాట్‌కు అప్‌సెట్ ధరను రూ.35 వేలుగా నిర్ణయించగా అత్యధికంగా గజం 65,300కు వెళ్లింది. 444.44 గజాలను రూ.2,90,21,932కి కొనుగోలు చేశారు. అలాగే అదే ఫేజ్–1లో ఎల్‌ఐజీ–89 ప్లాట్ల గజం 47 వేలకు, 54 ప్లాట్‌ను 43,900కు వెళ్లింది. ఇలా కుమ్మరిపాలెం లేఅవుట్‌లో 3, కనపక అయ్యన్నపేట హౌసింగ్ కాలనీ ఫేజ్–2లో 3, అయ్యన్నపేట లేఅవుట్‌లో 1, కూర్మన్నపాలెం ఫేజ్–1లో 3, ఫేజ్–2లో 1 ప్లాట్ ఇలా మొత్తంగా 11 ప్లాట్ల విక్రయాలు జరిగాయి. వీటి ద్వారా సంస్థకు రూ.11.13,34,004 కోట్లు ఆదాయం వచ్చినట్లు వీఎంఆర్‌డీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.

బ్యాంకును మోసగించిన కేసులో పలువురికి జైలు

విశాఖ లీగల్ : కుట్ర పూరితంగా వ్యవహరించి బ్యాంకును మోసం కేసులో ఇద్దరు బ్యాంకు అధికారులతో సహా మరొకరికి రెండేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ నగరంలో సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి హిమబిందు శుక్రవారం తీర్పు ఇచ్చారు. సీబీఐ అధికారులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మొదటి నిందితుడు సురేంద్ర అన్న దత్త నగరంలోని ఐడీబీఐ బ్యాంకులో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మరో నిందితుడు ద్విభాష్యం కార్తీక్ కూడా అదే బ్యాంకులో అసిస్టెంటు మేనేజర్‌గా పని చేసేవారు. బుద్ధ శ్రీనివాసరావు, బుద్ధ నిర్మల కొత్త కామరాజు, బెలగం శ్రీనివాసరావు, నంబాల సర్వీసెస్ దర్శన్ మేనేజ్‌మెంటు, రఘుపాత్రుని కనక లక్ష్మి ఐడీబీఐలో 2011, వివిధ సందర్భాల్లో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రూ.99.21 లక్షలు నష్టం కలిగించారు. దీనిపై సీబీఐ అధికారులు నిందితులపై రెండు కేసులు నమోదు చేశారు. రెండు కేసుల్లో బ్యాంక్ అధికారులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.90 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అలాగే దర్శన్ మేనేజిమెంటు వారికి కూడా రూ.30 వేల జరిమానా విధించారు. ప్రైవేటు వ్యక్తులకు ఏడాది చొప్పన జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. రెండు తీర్పుల్లో కూడా ఒకే విధంగా శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు.

City Guest



విజయదేవరకొండతో నటించాలని ఉంది

వర్ధమాన నటి ప్రగ్యా నయన్

సీతమ్మధార (విశాఖ ఉత్తర): 'విశాఖ అంటే చాలా ఇష్టం..ఇక్కడ అందాలకు ఫిదా అయ్యా' అని వర్ధమాన నటి ప్రగ్యా నయన్ పేర్కొన్నారు. దిల్‌వాలే సినిమా షూటింగ్ నిమిత్తం ఆమె విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా నయన్‌తో 'సాక్షి'తో చిట్‌చాట్.

సాక్షి : సినిమా రంగానికి ఎలా వచ్చారు?
నయన్ : మోడలింగ్‌లో రాణించడంతో నాపై నమ్మకం కలిగింది. క్రమంగా సినిమా అవకాశాలు వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటున్నా.
సాక్షి : ఇంతవరకు ఎన్ని చిత్రాల్లో నటించారు?
నయన్ : మూడు చిత్రాల్లో నటించా. సురాపానం నా తొలిచిత్రం..మంచి పేరు వచ్చింది. చక్రవ్యూహం మార్చిలో విడుదల కానుంది. మూడో చిత్రం దిల్‌వాలే. మరో సినిమా కూడా ఈనెల 26న ప్రారంభం కానుంది.
సాక్షి : మీకిష్టమైన హీరో
నయన్ : బన్నీ అంటే ఇష్టం. టాలీవుడ్‌లో అందరు హీరోలతో పనిచేయాలని ఉంది. ముఖ్యంగా విజయదేవరకొండ, పవన్ కల్యాణ్ వంటి స్టార్లతో నటించాలని ఉంది.
సాక్షి: మీ గురించి చెప్పండి
నయన్ : బెంగుళూరులో చదువుకున్నా..అక్కడే విప్రోలో ఉద్యోగం చేస్తూనే మోడలింగ్ చేశా.. అలా సినిమా అవకాశాలు రావడంతో ఉద్యోగం మానేసి పూర్తిగా సినిమాలపై దృష్టి పెట్టా.
సాక్షి : వైజాగ్ ఎలా ఉంది
నయన్ : వావ్ అద్భుతంగా ఉంది. ఇక్కడ బీచ్, పర్యాటక ప్రాంతాలు నా మనస్సు దోచుకున్నాయి. ఐ లవ్ వైజాగ్.

కేజీహెచ్‌లో వార్డుల తనిఖీ



కేజీహెచ్‌లో పర్యటిస్తున్న వైద్యుల బృందం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కింగ్ జార్జీ ఆస్పత్రిలో ఆరుగురు వైద్యుల బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, డిప్యూటీ సూపరింటిండెంట్లు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ వాణి, ఇతర వైద్య అధికారులు 26 విభాగాలను తనిఖీ చేశారు. నిర్ణీత సమాయానికి వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది వస్తున్నారా, లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. అలాగే వార్డుల్లో మౌలిక సదుపాయాలు అవసరం ఉందా? అన్న విషయాలను బృందం పరిశీలించింది. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసింది. కొన్ని వార్డుల్లో మినిస్టీరియల్ స్టాఫ్ , నాల్గో తరగతి ఉద్యోగులు కూడా విధులకు డుమ్మా కొడుతున్నట్టు ఆరోపణలు రావడంతో వారిపై నిఘా పెట్టారు. ఆర్‌ఎంవోలు డాక్టర్ వాసుదేవ రావు, డాక్టర్ అరుణాదేవి, జగదీష్, తదితరులు వీరి వెంట ఉన్నారు.

గంగవరం పోర్టులో లోకో ట్రైన్ ప్రారంభం



అదానీ గంగవరం పోర్టు ప్రవేశపెట్టిన కొత్త లోకో ట్రైన్

పెదగంట్యాడ (గాజువాక): అదానీ గంగవరం పోర్టు నూతన లోకో ట్రైన్‌ను శుక్రవారం ప్రవేశపెట్టింది. దీంతో నౌకాశ్రయ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు నౌకాశ్రయం నుంచి రేక్ హ్యాండ్లింగ్ సామర్థ్యం కూడా మెరుగుపడనుంది. ఈ పోర్టు మౌలిక సదుపాయాలను భావిఅవసరాలకు తగినట్టుగా ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ పోర్టులో నెలకు 600 రేక్‌లను నిర్వహించడం ద్వారా రికార్డు సృష్టించింది. గత డిసెంబర్‌లో గంగవరం పోర్టు 594 రేక్‌లను నిర్వహించింది. ఇప్పుడు దానిని అధిగమించింది. ఈ పోర్టులో లోతైన, బహుళ అవసరాలను తీర్చే కార్గో బెర్తులతో పాటు అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఉన్నాయి. వీటి ద్వారా దిగుమతి, ఎగుమతి కార్గోలను నిర్వహిస్తోంది. దీంతో పాటు పోర్టులో విస్తృత శ్రేణి నిల్వ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కవర్డ్ వేర్ హౌస్‌ల నుంచి పలు కార్గోలను నిర్వహించడం, అత్యాధునిక మెటీరియల్ హ్యాండ్లింగ్ వ్యవస్థలు ఇందులో ఉన్నాయి. గంగవరం పోర్టు స్థిరంగా మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్గో నిర్వహణ పరంగా కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సందర్భంగా పోర్టు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ పోర్టు వద్ద నూతన లోకోను ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అంతే కాకుండా ఒక నెలలో 600 రేక్స్ నిర్వహించి రికార్డు సృష్టించామని చెప్పారు. పోర్టు ద్వారా గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలను దిగుమతిదారులకు కల్పిస్తున్నామని వివరించారు. అత్యున్నత పోర్టు సేవలతో పాటు వేగవంతమైన టర్న్ ఎరౌండ్ సమయం, డెలివరీతో కూడిన ఇవాక్యుయేషన్ వ్యవస్థతో అందిస్తున్నామన్నారు.

విశాఖ చేరుకున్న మంత్రులు, నాయకులు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

గోపాలపట్నం: రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి విశాఖ విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ కోసం కేంద్ర మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళ్లామని తెలిపారు. వారంతా విశాఖ వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. మార్చ్ 3, 4న రెండు రోజులపాటు ఈ సమావేశం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు రావడంతో మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ధర్మాన ప్రసాద్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం విశాఖ చేరుకున్నారు. విజయవాడ నుంచి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు స్వాగతం పలికారు.

సాగిపో.. మెరుపులా..

- శరవేగంగా అనకాపల్లి-ఆనందపురం ఆరు లేన్ల రహదారి
- గంటకు 120 కి.మీ వేగంతో వెళ్లే అవకాశం
- 98 శాతం పనులు పూర్తి.. మార్చి నెలాఖరుకు సిద్ధం



అనకాపల్లి బైపాస్ వద్ద ఇంటర్ చేంజ్ సెక్షన్, సోలార్ లైట్లు..



అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి విహంగ వీక్షణం

సాక్షి, అనకాపల్లి/తుమ్మపాల: సర్రున సాగిపోయేలా ఆరు లైన్ల రోడ్డు.. డివైడర్లపై ఆహ్లాదకరంగా వేలాది మొక్కల పెంపకం.. బ్రేకుతో పనిలేదు.. టోల్‌ప్లాజా వచ్చే వరకు వాహనాన్ని నిలపాల్సిన అవసరమే రాదు.. ఇవీ అనకాపల్లి-ఆనందపురం ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి ప్రత్యేకతలు. విశాఖ నగరానికి రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగంగా అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం శరవేగంతో సాగుతోంది. రూ.2,013 కోట్లతో 50.8 కిలోమీటర్ల పొడవున దీనిని నిర్మిస్తున్నారు. ఢిల్లీకి చెందిన మెగా ఇంజనీరింగ్ డీబీఎల్ సంస్థ 98 శాతం పనులు పూర్తి చేసి మార్చి నెలాఖరు నాటికి జాతికి అంకితం చేసేందుకు వేగం పెంచింది. గంటకు 120 కిలోమీటర్ల వేగంగా వాహనాలు ప్రయాణించేలా ఈ రహదారిని విస్తరించారు. టోల్‌ప్లాజా వద్ద తప్పితే మరెక్కడా ఆగాల్సిన అవసరం ఉండదు. ప్రతి రెండు కిలోమీటర్లకు సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్‌తో నిఘా ఏర్పాటు చేశారు. దీని ద్వారా స్పీడ్ డిస్‌ప్లే, స్పీడ్ కంట్రోల్, ట్రాఫిక్ సిగ్నల్స్ తెలుసుకోవడం కూడా సులభంగా ఉంటుంది. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో, వంతెనల జంక్షన్లలో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

విశాఖ నగరానికి తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

చెన్నై-కలకత్తా 16వ నంబర్ జాతీయ రహదారి అనకాపల్లి, గాజువాక, ఎన్‌ఏడీ, విశాఖనగరం మీదుగా సాగిపోతుంది. రవాణా, ప్రజా రవాణా తదితర వాహనాలు విశాఖ నగరం మీద నుంచి రాకపోకలు చేయడంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. అనకాపల్లి నుంచి సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం వరకు జాతీయ రహదారిని కలుపుతూ ఈ ప్రాజెక్టు చేపట్టడంతో నగరానికి ట్రాఫిక్ సమస్య తొలగిపోనుంది. కేవలం పనులు ఉన్నవారు మాత్రమే నగరంలోకి వస్తారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి వద్ద బైపాస్ నుంచి సబ్బవరం మీదుగా ఆనందపురం వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. దీంతో నగరానికి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. విశాఖ నగరానికి ఇది బైపాస్ రోడ్డుగా ఉపయోగపడనుంది. సబ్బవరం దగ్గర ఒక ఇంటర్ చేంజ్ సెక్షన్, పెందుర్తి దగ్గర మరొకటి ఏర్పాటు చేయడంతో విశాఖనగరానికి వెళ్లేందుకు మరిన్ని దారులు ఏర్పడ్డాయి.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు

ఈ జాతీయ రహదారి పొడవు 50.8 కిలోమీటర్ల మేర ఉంది. రోడ్డు పొడవున ఇరువైపులా 15 వేలకు పైగా మొక్కలు నాటడం, నిత్యం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్డుకు మధ్యలో 32 వేలకు పైగా మొక్కలను నాటుతున్నారు.

స్థానికులకు నో టోల్‌ట్యాక్స్

ఈ రహదారిపై మొత్తం మూడు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేయనున్నారు. క్లోజ్డ్ టోలింగ్ సిస్టమ్ ద్వారా అనకాపల్లి వద్ద మర్రిపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం ప్రాంతాలలో చేపట్టే టోల్‌ప్లాజాల వద్ద స్థానికులు టోల్‌ఫీజు చెల్లించనక్కరలేదు. సర్వీసు రోడ్డును ఏ టోల్‌ప్లాజాకు అనుసంధానం చేయడం లేదు. దీంతో స్థానికులు టోల్‌ప్లాజాకు వెళ్లాల్సిన పనిలేకుండా సులభతరం చేస్తున్నారు.

రూ.2,013 కోట్లతో నిర్మాణం

దాదాపు 35 గ్రామాలను తాకుతూ నిర్మిస్తున్న ఈ రోడ్డుకు ప్రభుత్వం రూ.2,013 కోట్లు నిధులు వెచ్చిస్తోంది. ఈ మార్గంలో అనకాపల్లి బైపాస్ వద్ద ఒకటి, సబ్బవరం, పెందుర్తి జంక్షన్లలో మూడు ఇంటర్ చేంజ్ సెక్షన్లు, రెండు రైల్వే వంతెనలతో పాటు 21 అండర్‌బ్రిడ్జిలు, 10 వంతెనలు, 52 బాక్స్ కల్వర్టులు, 44 పైప్ కల్వర్టులు, 25 గ్రామాల వద్ద అప్రోచ్ రోడ్లు, 34 బస్‌స్టేషన్లు, 20 జంక్షన్లను రూపొందించారు. ఫ్లైఓవర్ల వద్ద గడ్డర్లు ఏర్పాటు చేసే ప్రాజెక్టును డీబీఎల్ సంస్థ చేపడుతుంది.

మార్చి నెలాఖరుకు పనులు పూర్తి



జాతీయ రహదారి విస్తరణ పనులు 98 శాతం పూర్తయ్యాయి. వచ్చే నెలాఖరునాటికి పనులు పూర్తయ్యేలా వేగం పెంచాం. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు ఏర్పాటు చేసిన జాతీయ రహదారి విస్తరణ పనులతో విశాఖ నగరానికి ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి. రోడ్డుపై ప్రతి రెండు కిలోమీటర్ల వద్ద సీసీ కెమెరాలు, జాతీయ రహదారి కూడలిలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశాం. ప్రమాదాలకు తావు లేకుండా ఆధునిక విధానంలో నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారి ఇది. వేగంతో వెళ్లినా ప్రమాదాలకు తావు లేకుండా జాతీయ రహదారి ఉంటుంది.

– ప్రమోద్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్, డీబీఎల్ సంస్థ

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం

- ఐవోసీఎల్ పరిశోధన విభాగం డైరెక్టర్ రామ్ కుమార్



డాక్టర్ రామ్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రామ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఏయూను సందర్శించి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డితో భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన రామ్ కుమార్‌ను వర్సిటీ తరపున వీసీ ప్రసాద రెడ్డి సత్కరించారు. అనంతరం పాలకమండలి సమావేశ మందిరంలో ఏయూ అధికారులు, ఆచార్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ ఇంధన రంగానికి ఉపయుక్తంగా నిలిచేలా ఏయూ నుంచి విశిష్ట ఆలోచనలతో పరిశోధనలను తాము ప్రోత్సహిస్తామన్నారు. గత ఐదు దశాబ్దాలుగా ఐవోసీఎల్‌కు చెందిన ప్రత్యేక రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ చేపడుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలు, పేటెంట్‌లను వివరించారు. త్వరలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధనలపై వివరించారు. నెట్, గేట్ అర్హత సాధించిన పరిశోధకులకు తమతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. బయోమాస్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్ – పాలిమర్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ రంగాల్లో సంయుక్తంగా పనిచేయడానికి అనుకూలంగా ఉన్న అంశాలను వివరించారు. ఏయూ విద్యార్థులు, పరిశోధకులు నూతన ఆలోచనలతో వస్తే తాము నిర్వహించే స్టార్టప్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఐవోసీఎల్‌తో తమ భాగస్వామ్యం మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిషోర్ బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు ఆస్పత్రిని కాపాడుకుందాం



పోర్టు సీహార్స్ జంక్షన్ వద్ద మాట్లాడుతున్న నరసింగరావు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖ పరిశ్రమలకే కన్నతల్లి వంటి విశాఖపట్నం పోర్టు, పోర్టు ఆస్పత్రిని కాపాడుకుందామని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పోర్టు హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి ఇవ్వాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పోర్టు సీహార్స్ జంక్షన్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ పోర్టు స్థలాలు, స్టేడియం, కల్యాణమండపాలు ప్రైవేట్‌కి ఇవ్వరాదని, ఎన్‌ఎంపీ పేరిట బెర్తుల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చరాదని, సీహెచ్ క్యాజువల్, పూల్, పోర్టు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెండింగ్ బోనస్ ఇవ్వాలని, కొత్త బోనస్ ఫార్ములా, షరతులు లేని వేతన ఒప్పందం వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ గత 38 ఏళ్లుగా వేలాది మంది కార్మికులు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యం అందిస్తోందని, అటువంటి ఆస్పత్రిని క్రిసిల్ రిమ్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్ (ముంబయి సంస్థ)కి పీపీపీ పద్ధతిలో కట్టబెట్టాలని షిప్పింగ్ మినిస్ట్రీ అనుమతికి పంపారన్నారు. పోర్టు హాస్పిటల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం చేయరాదని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, కుమార్ మంగళం, బి.జగన్, కేఎం శ్రీనివాస్, వీఎస్ పద్మనాభరాజు, నాని, మసేన్, అప్పారావు, డీకే శర్మ, చందు, పెన్షనర్స్ సంఘం నాయకులు బి.రామారావు, చౌదరి అప్పారావు, స్వతంత్రకుమార్ తదితరులు పాల్గన్నారు.

మనుషులను కలిపేది ధర్మం

బీచ్‌రోడ్డు: ధర్మం పేరుతో మనుషులను విడదీస్తున్నారని... అయితే ధర్మం ఎల్లప్పుడూ మనుషులను కలుపుతుందని సద్గురు మాతా సుదీక్షాజీ మహారాజ్ అన్నారు. విశ్వ కల్యాణ యాత్రలో భాగంగా శుక్రవారం నిరంకారి మిషన్ ఆధ్వర్యంలో సిరిపురం గురజాడ కళాక్షేత్రం నిరంకారి సంత్ సమాగం ఏర్పాటు చేశారు.

జీవిత భాగస్వామి పూజ్య రమిత్ చందనాజీతో కలిసి సుదీక్షాజీ ఈ సమాగంలో పాల్గొని మాట్లాడారు. బ్రహ్మ జ్ఞానం ద్వారా మనిషి తను ఎవరో, మానవ జన్మ లక్ష్యం ఏమిటో తెలుసుకోవడం సాధ్యమన్నారు. మనుషులంతా ఆ భగవంతుని బిడ్డలే అని, అందరిలోనూ ఆ భగవంతుడే ఉన్నారన్నారు. విశ్వమంతా ఒక కుటుంబమన్న మహాతత్వాన్ని ప్రపంచానికి తెలియజేయడమే నిరంకారి మిషన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందుకోసం విశ్వ కల్యాణ యాత్ర చేపడుతున్నామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల జోన్ ఇన్‌చార్జి మోహిని బెహన్, ప్రేమ్ మిర్పూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ అగ్నిమాపక అధికారిగా నిరంజన్‌రెడ్డి



అల్లిపురం (విశాఖ దక్షిణ): అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారిగా డి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాంతీయ కార్యాలయాన్ని మహారాణిపేట, దండుబజారులో గల జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో రెండు రీజియన్లు ఉండేవన్నారు. వాటిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం నిమిత్తం విశాఖ, రాజమండ్రి, గుంటూరు, కర్నూలు కేంద్రాలుగా నాలుగు రీజియన్లుగా ఏర్పాటు చేశారన్నారు. జోన్-1 పరిధిలో విశాఖపట్నం రీజియన్‌లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలు ఉన్నాయన్నారు.

పరిశ్రమల ప్రమాదాలపై అవగాహన : పరిశ్రమల్లో ప్రమాదాలపై దృష్టి పెడతామని ఆర్.ఎఫ్.ఓ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలలో భద్రత నిమిత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజయనగరంలో రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో తగినంత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీన అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా ఫైర్ సేఫ్టీ అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, సినిమాహాల్స్ తదితర వాటికి అగ్నిమాపక అనుమతులు అగ్ని యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ యాప్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

శారదా పీఠానికి వేద గాయత్రిదేవి ఆలయం దత్తత

సింహాచలం : జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోటలో ఉన్న వేద గాయత్రి దేవి ఆలయాన్ని విశాఖ శ్రీ శారదా పీఠానికి ఆలయ కమిటీ దత్తత ఇచ్చింది. ఈ మేరకు శారదా పీఠంలో స్వరూపానందేంద్ర సరస్వతిని ఆలయ కమిటీ ధర్మకర్త రాపర్తి కన్నా, గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు పీఠంలో శుక్రవారం కలిసి సంబంధిత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త రాపర్తి కన్నా మాట్లాడుతూ వేదమాత గాయత్రి దేవి ఆలయాన్ని కమిటీ అభ్యర్థన మేరకు విశాఖ శ్రీ శారదాపీఠంలో కలపాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ఈ మేరకు స్వామీజీని కలిసి పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్మారావు, కార్యదర్శి శర్మ, ప్రతినిధులు వాసు మాస్టారు, మంగు శేషగిరిరావు, కృష్ణమూర్తి మాస్టారు, ఆకెళ్ల బాబి, సుబ్బరామన్, జి.రామారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

అల్లిపురం (విశాఖ దక్షిణ): కుటుంబ సభ్యులు చూస్తున్న పెళ్లి సంబంధాలు ఇష్టం లేక మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన ఘటనకు సంబంధించి సీఐ రేవతి తెలిపిన వివరాల ప్రకారం... పాతనగరానికి చెందిన చిన్నమ్మలు వారి వీధిలో నివసిస్తున్న సూరాడ సంధ్య (24) వైద్య విద్య చదువుతోంది. తండ్రి మసేను ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. ఆయన చూసిన ప్రతీ సంబంధం నచ్చలేదని సంధ్య చెప్పేది. తనకు అప్పుడే పెళ్లి వద్దని, తాను చదువుకుంటానని చెప్పేది. ఈ క్రమంలో ఇటీవల ఆమె వద్దకు పెళ్లి సంబంధం ప్రస్తావన తీసుకొచ్చారు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి



సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : మాతా, శిశు మరణాల నివారణ కోసం కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. తన కార్యాలయంలో కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ గత మూడు నెలల కాలంలో 5 మాతృ మరణాలు, 3 శిశు మరణాలు సంభవించాయని పేర్కొన్నారు. ఇక ముందు మరణాలు సంభవించకుండా గైనకాలజిస్టుల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలకు ప్రతి ఆరు నెలలకు శిక్షణ ఇవ్వాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్ కిషోర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ డి.వెంకటలక్ష్మి, వైద్యులు సంధ్య, శ్యామల, ఉషారాణి, సీబీ నాయుడు, అర్జున్ కుమార్, విద్యా సాగర్, బి.శ్రీనివాసరావు, గణేష్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, వుమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, ఇతర అధికారులు బి.జ్యోతి, బి.నాగభూషణం పాల్గొన్నారు.